బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

గచ్చిబౌలి: కొండాపూర్‌ టీజీఎస్‌ఎస్‌పీ 8వ బెటాలియన్‌ కమాండెంట్‌ ఎం.రామకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. కమాండెంట్‌గా పనిచేసిన సన్నీ పదోన్నతిపై హెడ్‌ క్వార్టర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో ఇంటెలీజెన్స్‌లో పనిచేస్తున్న రామకృష్ణ బదిలీపై కమాండెంట్‌గా వచ్చారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌ తదితరులు

శేరిలింగంపల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌ తెలిపారు. సిటిజన్‌ స్పెషాలిటీ హాస్పిటల్‌, జేసీఐ సికింద్రాబాద్‌ వాకర్స్‌ టౌన్‌, జేసీఐ ఇండియా రైజ్‌ యూపీ 2025 సంయుక్తాధ్వర్యంలో శనివారం పాపిరెడ్డినగర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని జేసీఐ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు సుమిత్‌ గోయల్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ..అందరికీ వైద్య సేవలు అందించేందుకు ముందుకొచ్చిన సంస్థలను ఆయన అభినందించారు. అనంతరం జీహెచ్‌ఎంసీ శానిటేషన్‌ సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీఐ జోన్‌ అధ్యక్షుడు చతుర్వేది, ఉపాధ్యక్షుడు వేణుగోపాల్‌, ప్రతినిధులు సుమతి, క్రాంతి, పాపిరెడ్డినగర్‌ అధ్యక్షుడు బద్దం కొండల్‌రెడ్డి, నాయకులు అభిషేక్‌యాదవ్‌, శ్రీకళ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.


హుండీ ఆదాయం లెక్కింపు



లెక్కింపు చేస్తున్న సిబ్బంది

పటాన్‌చెరు: అమీన్‌పూర్‌ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ భ్రమరాంబిక మల్లికార్జున స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. మహాశివరాత్రి ఉత్సవాల ఆదాయం రూ.47,99,283 వచ్చిందని ఆలయ ఈఓ శశిధర్‌, ఆలయ కమిటీ చైర్మన్‌ బైసా సుధాకర్‌ యాదవ్‌ తెలిపారు. దేవాదాయ శాఖ స్పెషల్‌ ఆఫీసర్‌ అన్నపూర్ణ పర్యవేక్షణలో హుండీ లెక్కింపు కొనసాగింది. ఈ సందర్భంగా చైర్మన్‌ సుధాకర్‌యాదవ్‌, ఈఓ శశిధర్‌గుప్తా మాట్లాడుతూ.. వచ్చిన ఆదాయాన్ని దేవాలయం అభివృద్ధికి ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్‌ అసిస్టెంట్‌ మల్లికార్జున్‌ రెడ్డి, ఆలయ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

జాతరకు ఆహ్వానం



ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గ్రామస్తులు

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం మున్సిపాలిటీలో ఈ నెల 9న నిర్వహించనున్న కట్ట మైసమ్మ జాతరలో ముఖ్యఅతిథిగా పాల్గొనాలని రాష్ట్ర బీఆర్‌ఎస్‌ నాయకులు, సీజీఆర్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్‌ను కోరారు. ఈ మేరకు శనివారం ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పెంటేష్‌, కుమార్‌, దేవయ్య, బాలయ్య, శ్రీనివాస్‌, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినికి అవార్డు అందజేత

మూసాపేట: ప్రజా ఆలోచన వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఉప్పల గోపాలరావు(ఉగోరా) జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ మార్కులు సాధించిన పొలిటికల్‌ సైన్స్‌ విద్యార్థిని దివ్యకు అవార్డు, నగదు పారితోషికం అందజేశారు. కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ అలివేలు మంగమ్మతో కలిసి వేదిక అధ్యక్షుడు విద్యా వెంకట్‌ అందజేశారు. కార్యక్రమంలో పొలిటికల్‌ సైన్స్‌ ఇన్‌చార్జి నాగుల వేణు, ప్రజా ఆలోచన వేదిక ప్రతినిధి పందిరి శేఖర్‌, అధ్యాపకులు మాధవి, జ్యోత్స్న, జి. సంధ్యారాణి, కె. అరుణ, కె. సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

ప్రైవేటుకు దీటుగా | ప్రభుత్వ బడులను తీర్చిదిద్దుతాం

• ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ



గోపన్‌పల్లి తండాలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే గాంధీ



జడ్సీ ఉపేందర్‌రెడ్డితో కలిసి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే

గచ్చిబౌలి: శేరిలింగంపల్లిలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు, కార్పొరేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతామని పీఏసీ చైర్మన్‌, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ స్పష్టం చేశారు. శనివారం ఎమ్మెల్యే ఎస్‌డీఎఫ్‌ మంజూరైన రూ.2.56 కోట్ల అంచనా వ్యయంతో గచ్చిబౌలిలోని గోపన్‌పల్లితాండ, మాదాపూర్‌లోని చంద్రానాయక్‌ తండాలలో అదనపు తరగతి గదులకు శంకుస్థాపన చేశారు. అదే విధంగా మాదాపూర్‌, శేరిలింగంపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్‌లలో నిర్మించిన అదనపు తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలల్లో అవసరమైన మేరకు తరగతి గదులను నిర్మాణం చేయిస్తామని, డ్యూయల్‌ డెస్కులు, విద్యుత్‌ వెలుగులు, పరిశుభ్రమైన టాయిలెట్లు, స్వచ్ఛమైనర తాగునీటి ట్యాంకులు, వంటగదులు, భోజన శాలలు, వాకింగ్‌ ట్రాక్‌లు, చుట్టూ ప్రహరీలు నిర్మాణం జరిగేలా అన్ని చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు. విద్యార్థులు ఏకాగ్రతతో చదువులు కొనసాగించేలా అవసరమైన ఆహ్లాదపూరిత వాతావరణం ఉండేలా చేస్తామన్నారు. నేడు ప్రభుత్వ పాఠశాలలు అసలు సిసలైన సరస్వతీ నిలయాలుగా రూపుదిద్దుకుంటున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను అన్ని రకాల వసతులతో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారని గుర్తు చేశారు. సౌకర్యాల కల్పనపై మేము పూర్తి స్థాయి దృష్టిసారిస్తామని, ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలు వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఎలాంటి సౌకర్యాలు కావాలన్నా వెంటనే మా దృష్టికి తీసుకొస్తే ప్రభుత్వం, అధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించేలా చేస్తామన్నారు. పాఠశాలల్లో చేపట్టే ఎలాంటి నిర్మాణాలైనా నాణ్యత ఎలాంటి రాజీ పడే ప్రసక్తే లేదని, నాలుగు కాలాలపాటు తరగతి గదులు ఉండేలా చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లకు ఆయన సూచించారు. పాఠశాలల ప్రాంగణంలో కూడా పచ్చని వాతావరణం కోసం మొక్కలు నాటి వాటిని పెంచేలా చూడాల్సిన అవసరం కూడా ఉందని పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యా, వైద్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, అందుకే సౌకర్యాల కల్పనకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాగం నాగేందర్‌యాదవ్‌, గంగాధర్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్‌, హమీద్‌ పటేల్‌, టీఎస్‌డబ్ల్యూఐడీసీ ఈఈ రాంకుమార్‌, డీఈ కలీముద్దీన్‌, ఏఈ శ్యామ్‌ప్రసాద్‌, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలు పరిష్కరించాలి..

అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. శనివారం శేరిలింగంపల్లి జోనల్‌ కార్యాలయంలో జడ్సీ ఉపేందర్‌రెడ్డితో కలిసి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజీరా పైప్‌లైన్‌ నిర్మాణ పనులు, శ్రీదేవి థియేటర్‌ రోడ్డు విస్తరణ పనులు త్వరితగతిన చేపట్టాలని సూచించారు. వర్షాకాలం లోపు నాలాల విస్తరణ, సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తిచేయాలని పేర్కొన్నారు. లింకు రోడ్ల పనుల్లో జాప్యం లేకుండా ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. రోడ్లు, వీధి దీపాలు, డ్రైనేజీ, తాగునీటి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌, ఎస్‌ఈ శంకర్‌, ఈఈ దుర్గాప్రసాద్‌, సీపీ శ్యామ్‌ కుమార్‌, డిప్యూటీ సిటీ ప్లానర్‌ తులసీ రాం తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత

ఎంపీ రఘునందన్‌రావు

పటాన్‌చెరుటౌన్‌: దైవ చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీ రఘునందన్‌ రావు పేర్కొన్నారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని చైతన్యనగర్‌ కాలనీలోని శనివారం మహాదేవుని ఆలయంలో శివస్వామి రాచమల్ల సంతోష్‌గౌడ్‌ ఇరుముడి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఎంపీ రఘునందన్‌రావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, అమీన్‌పూర్‌ మండల అధ్యక్షుడు ఈర్ల రాజు ముదిరాజ్‌, పటాన్‌చెరు డివిజన్‌ అధ్యక్షుడు ఆనందరెడ్డి, తెల్లాపూర్‌ మున్సిపల్‌ అధ్యక్షుడు రాముగౌడ్‌, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ రఘునందన్‌రావు

మౌలిక వసతుల కల్పనకు కృషి



కార్పొరేటర్‌ను కలిసిన అసోసియేషన్‌ సభ్యులు

మియాపూర్‌: కాలనీ, బస్తీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కార్పొరేటర్‌ శ్రీకాంత్‌ పేర్కొన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ప్రశాంత్‌నగర్‌ కాలనీలోని రాఘువేంద్ర పాంచజన్య అపార్ట్‌మెంట్స్‌ అసోసియేషన్‌ సభ్యులు ఆయనను శనివారం కలిసి సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. కార్పొరేటర్‌ను కలిసిన వారిలో సూర్య, ప్రకాష్‌రెడ్డి, సభ్యులు, శ్రీను, ఓం ప్రకాష్‌, రాజు, శరత్‌ బాబు, సతీష్‌, అనీల్‌ తదితరులు పాల్గొన్నారు.

5కే రన్‌ లోగో ఆవిష్కరించిన మంత్రి సీతక్క



ఆల్విన్‌కాలనీ: అవని స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు శిరీష సత్తూర్‌ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 16న 5కే రన్‌ నిర్వహించనున్నారు. శనివారం ఆ లోగోను మంత్రి ధనసరి సీతక్క, తెలంగాణ పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్‌ చైర్మన్‌ పటేల్‌ రమేష్‌ రెడ్డి, కాంగ్రెస్‌ శేరిలింగంపల్లి పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌ గౌడ్‌ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మాజీ కార్పొరేటర్‌ భానుప్రసాద్‌, సీనియర్‌ నాయకులు కూన సత్యం గౌడ్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, మధు, ఎల్లాజీ, యశ్వంత్‌, పద్మ, గాయత్రి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న రవికుమార్‌యాదవ్‌ తదితరులు

రాయదుర్గం: శేరిలింగంపల్లి డివిజన్‌లో నెలకొన్న సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్‌ జోనల్‌ కమిషనర్‌ ఉపేందర్‌రెడ్డికి కోరాఉ. ఈ మేరకు శనివారం వినతిపత్రం అందజేశారు. గోపీనగర్‌లోని పలు రోడ్లు, మసీదుబండలోని జీహెచ్‌ఎంసీ కమ్యూనిటీహాల్‌ నిర్మాణం చేసి మల్టీ లెవల్‌ ఫంక్షన్‌ హాల్‌ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని కోరారు. ముఖ్యంగా గోపీనగర్‌లో రోడ్లు సరిగ్గా లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మసీదుబండలోని కమ్యూనిటీహాల్‌ శిథిలావస్థకు చేరిందని, ఆ ప్రాంతంలో మల్టీ లెవల్‌ ఫంక్షన్‌ హాల్‌ ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎంతో మేలు చేకూరుస్తుందన్నారు. ఇందుకు జోనల్‌ కమిషనర్‌ స్పందిస్తూ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని ఆదేశిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎల్లేష్‌, రాజశేఖర్‌, శివ, శ్రీధర్‌, తదితరులు పాల్గొన్నారు.

వార్షికోత్సవం

మాదాపూర్‌: మాదాపూర్‌లోని హెచ్‌ఐసీసీలో శనివారం మైస్కూల్‌ ఇటలీ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్నేడియం పేరుతో నిర్వహించిన ఈ వేడుకల్లో నగరంలోని పలు శాఖలకు చెందిన విద్యార్థులు పాల్గొని తన ప్రతిభను చాటారు. ఈ సందర్భంగా మైస్కూల్‌ ఇటలీ వ్యవస్థాపకురాలు అపర్ణ వల్లూరి మాట్లాడుతూ..యూరోపియన్‌ దేశాలకు చెందిన న్యూరో సైన్స్‌ బెస్ట్‌ స్టడీని విద్యార్థులకు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఫౌండర్‌ ప్రసాద్‌ గారపాటి, సీవో ఎంఎస్‌ఆర్‌ గుప్తా, డాక్టర్‌ పీటర్‌, ప్రముఖ కేన్సర్‌ వ్యాధి నిపుణులు డాక్టర్‌ చినబాబు, ఇటాలియన్‌ ఎంబసీ ప్రతినిధి ఫెగ్గిగ్రైంచ్‌, దిలీప్‌ ఆచార్య తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి నష్ట పరిహారం

జిన్నారం (పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ శివారులోని శ్రీ శక్తి ఎలక్ట్రానిక్స్‌ ప్రైవేటు లిమిటెడ్‌ పరిశ్రమలో కృష్ణారావు అనే కార్మికుడు గత కొన్ని ఏళ్లుగా పనిచేస్తున్నాడు. ఇటీవల పరిశ్రమలో గుండెపోటు రావడంతో మృతి చెందాడు. పరిశ్రమ యాజమాన్యం కుటుంబానికి న్యాయం చేయకపోవడంతో భార్యాపిల్లలు బీఆర్‌టీయూ రాష్ట్ర కార్మిక నాయకుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత రవిసింగ్‌ను ఆశ్రయించారు. ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి కుటుంబానికి నష్టపరిహారం రూ.9 లక్షల చెక్కు అందించేలా కృషి చేశారు. ఆపద సమయంలో అండగా నిలిచిన నాయకులకు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తిపన్ను సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్‌

చందానగర్‌: చందానగర్‌ సర్కిల్‌ పరిధిలో ఆస్తిపన్ను సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కౌంటర్‌ను శనివారం ఉప కమిషనర్‌ మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆస్తిపన్ను విషయంలో ఎలాంటి సమస్యలు ఉన్న, పునఃసమీక్షా అభ్యర్థనలు, ఆస్తిపన్ను అంచనాల్లో సవరణలు, బిల్‌ కలెక్టర్ల ద్వారా చెల్లింపుల నమోదు, ఆన్‌లైన్‌ బకాయిలు సరి చేయడం, కోర్టు కేసుల పరిష్కారం, ఐజీఆర్‌ఎస్‌ సమస్యలు స్వయం మూల్యాంకనం సంబంధిత విషయాలు తదితర సమస్యలు ప్రత్యేక కౌంటర్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ నెల 31తేదీ వరకు ప్రతి శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజలు తమ ఫిర్యాదులు అందించవచ్చన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌ మేళా

మూసాపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాల కూకట్‌పల్లి టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో కైటెక్‌ టెక్నాలజీస్‌ సాఫ్ట్‌వేర్‌ కంపెనీ శనివారం జాబ్‌ మేళా నిర్వహించింది. 75 మంది విద్యార్థులు హాజరయ్యారు. 42 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌ ద్వారా జాబ్‌ ఆఫర్‌ చేశారు. వార్షిక వేతనం 5.2 లక్షలుగా కంపెనీ అధికారులు పేర్కొన్నారని కళాశాల ప్రిన్సిపాల్‌ డా. ఎన్‌. అలివేలు మంగమ్మ తెలిపారు. అత్యధిక వార్షిక వేతనం ఆఫర్‌ చేయటం కళాశాలకు గర్వకారణమన్నారు.

నృత్యం.. నయనానందకరం



మాదాపూర్‌లోని శిల్పారామంలో అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్‌: కళాకారులు కథక్‌, భరతనాట్య ప్రదర్శనలతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా శనివారం బెంగళూర్‌కు చెందిన కథక్‌ కళాకారిణి అమ్రితా బెనర్జీ కథక్‌ నృత్య ప్రదర్శనతో సందర్శకులను అలరించింది. నృత్య ప్రదర్శనలో భాగంగా శివవందన, తాల్‌ ధంగార్‌, లపక్‌ ఝుపక్‌, తుమ్రి అంశాలను ప్రదర్శించి అలరించారు. వంశీమాధవి శిష్యబృందం గోపిక, అర్పిష్మాతే, గాయత్రి, జాహ్నవి, నైనికా తదితరులు పాల్గొని పుష్పాంజలి, అలరిపు, దశావతార శబ్దం, తీరుపల్లాండు, పదం, థిల్లాన తదితర అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు.

నూతన ఫ్లైఓవర్‌పై రాకపోకలు షురూ

చందానగర్‌: చందానగర్‌ జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ పనులు దాదాపు పూర్తి అయిన నేపథ్యంలో శనివారం తాత్కాలికంగా ఫ్లైఓవర్‌పైన ఉన్న ఒకవైపు వాహనాల రాకపోకలు ప్రారంభించారు. ఫ్లైఓవర్‌ పక్కన ఉన్న సర్వీస్‌ రోడ్డు మరమ్మతులు జరుగుతున్న సందర్భంగా అధికారులు వాహనాలు డైవర్షన్‌ చేశారు. రోజురోజుకూ నగర విస్తరణతో పాటు వాహనాల రద్దీ పెరగడంతో రోడ్డు విస్తరణలో భాగంగా చందానగర్‌ నుంచి అశోక్‌నగర్‌ వరకు 1.5 కిలోమీటర్ల మేర 24 మీటర్ల వెడల్పు, రూ.170 కోట్లతో ఫ్లైఓవర్‌ నిర్మించారు. వాహనదారుల, ప్రజల కష్టాల త్వరలోనే తీరనున్నాయన్నారు. రెండు త్వరలోనే ఫ్లైఓవర్‌ సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

అలరించిన ‘వీణార్చన’



మాదాపూర్‌: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో శనివారం నిర్వహించే అన్నమాస్వరార్చన కార్యక్రమంలో భాగంగా పద్మజా చల్లా ‘వీణార్చన’కార్యక్రమంతో సందర్శకులను అలరించారు. శాస్త్రీయ వీణా వాయిద్యంపై చాలదా హరినామ, గోవింద గోవింద, తందనాన ఆహి, నగవులు నిజమని, కొలనులోని మునుగోపికలు, జగదపు చనువుల, తదితర బహుళ ప్రాచుర్యం పొందిన అన్నమాచార్య సంకీర్తనలను శృతి బద్ధంగా వీణపై ఆలపించి సందర్శకులను ఆకట్టుకున్నారు. వయోలిన్‌ మురళీధర్‌, మృదంగంపై ప్రసాద్‌ సంగీత సహకారాన్ని అందించారు.

ఆకట్టుకున్న చిత్ర ప్రదర్శన

మాదాపూర్‌: కళాకారుడు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఉన్నాయి. పల్లెటూరి వాతావరణంలో ప్రజల జీవన విధానాన్ని కళ్లకు కట్టినట్టు చూపించాడు కళాకారుడు కొండూరు నాగేశ్వరరావు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్‌ ఆర్ట్‌గ్యాలరీలో శనివారం టేల్స్‌ ఆఫ్‌ పెదరావూరు పేరిట చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలో 22 చిత్రాలను ఈనెల 3వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి రాత్రి 7గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.





ఘనంగా సైన్స్‌ డే



వేడుకల్లో ప్లానిటరీ సొసైటీ డైరెక్టర్‌ రఘునందన్‌

గచ్చిబౌలి/రాయదుర్గం: గచ్చిబౌలిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మణికొండలోని ప్రభుత్వ పాఠశాలలో సైన్స్‌ డే వేడుకలకు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్లానిటరీ సొసైటీ డైరెక్టర రఘునందన్‌ హాజరై మాట్లాడుతూ..ప్రతి అంశంపై ప్రతి విద్యార్థికి అవగాహన ఎంతో ఉపయుక్తంగా మారుతుందన్నారు. అనంతరం బీస్టుడియో వారు సైన్స్‌ టెంపర్‌పై నాటకాన్ని ప్రదర్శించారు. ఎస్వీకే ట్రస్ట్‌ సభ్యులు ఆర్‌ సాంబశివరావు, హెచ్‌ఎం నిరంజన్‌, ఎస్వీకే బాధ్యులు అనీల్‌, స్కూలు టీచర్లు బి కృష్ణయ్య, శివరాజు పాల్గొన్నారు.

రాయదుర్గం జెడ్పీహెచ్‌ఎస్‌లో..

రాయదుర్గంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్‌ డేను శనివారం నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి తరగతుల విద్యార్థులు 88కి పైగా ఎగ్జిబిట్లు ఏర్పాటు చేశారు. విద్యాశాఖ రీజనల్‌ జాయింట్‌ డైరెక్టర్‌ విజయలక్ష్మి, హెచ్‌ఎం తాజ్‌బాబుతో కలిసి ఎగ్జిబిట్లను తిలకించి విద్యార్థులను అభినందించారు. నాగార్జున స్కూల్‌ కరస్పాండెంట్‌ భరత్‌కుమార్‌, తాజ్‌బాబు విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో పావని, మమత, వసంత క్రాంతిస్వర్ణలత, సుధీరా, శ్రీనివాస్‌, కృష్ణవేణి, శాంత సుభాషిణి, భాగ్యలక్ష్మి, మహిపాల్‌, లక్ష్మణ్‌ పాల్గొన్నారు.



మాదాపూర్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో..



రాయదుర్గంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో..